రాళ్లతో ఎవరిని కొట్టాలి?

అప్పుడు నీతులు.. ఇప్పుడు నీతిమాలిన పనులా? • ఫిరాయింపులు ప్రోత్సహించి రాజ్యాంగ స్ఫూర్తిని చంపేశారు • సీఎంపై కేటీఆర్ ఘాటు విమర్శ

హైదరాబాద్, జూన్ 25(నమస్తే తెలంగాణ): ప్రచారంలో నీతులు చెప్పి ఇప్పుడు నీతిమాలిన పనులు చేస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గతంలో పార్టీ ఫిరాయింపులను తీవ్రంగా వ్యతిరేకించిన సీఎం, ఇప్పుడు స్వయంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఇళ్లకు వెళ్లి పార్టీలో చేర్చుకోవడం ఏమిటని ఎక్స్ వేదికగా మంగళవారం కేటీఆర్ ప్రశ్నించారు. 'నాడు.. ఒక పార్టీలో గెలిచి మరో పార్టీలో చేరడం నేరమన్నారు. ప్రలోభాలకు లొంగి పార్టీ ఫిరాయించడం ఘోరమన్నారు. భుజాలపై మోసిన కార్యకర్తల పాలిట తీరని ద్రోహమన్నారు. చివరికి ఎమ్మెల్యేలు పార్టీ మారితే రాళ్లతో కొట్టి చంపమన్నారు. రాజీనామా చేయకుండా ఇతర పార్టీలో చేరితే ఊళ్లనుంచి తరిమి కొట్టమన్నారు. మరి ఇవాళ మీరే బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఇళ్లకు వెళ్లి మరీ కాంగ్రెస్ కండువాలు కప్పి కప్పదాట్లను ప్రోత్సహిస్తారా? జంప్ జిలానీల భరతం పడతా అని భారీ డైలాగులు కొట్టి ఇప్పుడు ఏ ప్రలోభాలను ఎర వేస్తున్నారు? ఏ ప్రయోజనాలు ఆశిస్తున్నారు? ఇప్పుడు రాళ్లతో కొట్టాల్సింది ఎవరిని? రాజకీయంగా ఘోరీ కట్టాల్సింది ఎవరికి? ఏ ఎమ్మెల్యేనైనా రాజీనామా చేయకుండా పార్టీ ఫిరాయిస్తే రాళ్లతో కొట్టించే బాధ్యత తీసుకుంటా అన్నది మీరే. అందుకే ఇప్పుడు జవాబు చెప్పాల్సింది కూడా మీరే' అని కేటీఆర్ పేర్కొన్నారు.

ఇది రాజ్యాంగ రక్షణా.. అపహాస్యమా?

మరో ట్వీట్‌లో కాంగ్రెస్ పార్టీ ద్వంద వైఖరిని కేటీఆర్ తీవ్రస్థాయిలో తూర్పారబట్టారు. పార్టీ ఫిరాయింపులపై గతంలో రాహుల్ గాంధీ చెప్పిన విషయాలను గుర్తుచేస్తూ, ఇప్పుడు కాంగ్రెస్ వ్యవహరిస్తున్న తీరును నిరసించారు. 'కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ చేతిలో రాజ్యాంగాన్ని పట్టుకొని పార్టీ ఫిరాయించిన ప్రజా ప్రతినిధులపై అనర్హత పడేలా రాజ్యాంగంలోని పదో షెడ్యూల్‌ను సవరిస్తామని పెద్ద పెద్ద మాటలు చెప్పారు. ఇప్పుడు అదే రాహుల్‌గాంధీ రాజ్యాంగంలోని ఫిరాయింపుల నిరోధక నిబంధనలకు విరుద్ధంగా ఐదుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను తమ పార్టీలో చేర్చుకున్నారు. ఇది రాజ్యాంగ రక్షణా.. లేక అపహాస్యమా? పార్టీ మారిన ఎమ్మెల్యేలపై మూడు నెలల్లో స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు చెప్పింది. దీనికి విరుద్ధంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను చేర్చుకుంటున్నారు. దీనిపై మేము సుప్రీంకోర్టుకు వెళ్తాం' అని కేటీఆర్ స్పష్టంచేశారు.

కాంగ్రెస్ వంచనకు ప్రతిరూపం

> కాంగ్రెస్ పార్టీ వంచనకు ప్రతిరూపమని మరో ట్వీట్‌లో కేటీఆర్ విమర్శించారు. 'సరిగ్గా 49 ఏండ్ల క్రితం ఇదేరోజున కాంగ్రెస్ పార్టీ భారతదేశంలో ఎమర్జెన్సీ విధించడం ద్వారా పౌరహక్కులు, ప్రజాస్వామ్య హక్కులను, ప్రజల గొంతులను అణచివేసింది. దశాబ్దాలు గడిచినా ప్రజాస్వామ్యంపై కాంగ్రెస్ దాడి కొనసాగుతూనే ఉన్నది. ఓ వైపు కాంగ్రెస్ పార్టీ నేతలు పార్లమెంటులో భారత రాజ్యాంగం కాపీలను పట్టుకోగా, మరో వైపు కొన్ని కిలోమీటర్ల దూరంలోనే ఉన్న వారి పార్టీ కార్యాలయంలో పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తూ రాజ్యాంగ స్ఫూర్తిని చంపారు' అని కేటీఆర్ పేర్కొన్నారు.

వేటు పడేవరకు వదిలేదే లేదు

- **మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి**

హైదరాబాద్, జూన్ 25 (నమస్తే తెలంగాణ): ఫిరాయింపుదారులపై వేటు పడేవరకు కాంగ్రెస్‌ను విడిచిపెట్టేది లేదని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీమంత్రి జీ జగదీశ్‌రెడ్డి హెచ్చరించారు. పార్టీ మారిన ఐదుగురు ఎమ్మెల్యేల సభ్యత్వం రద్దు కావాల్సిందేనని పేర్కొన్నారు. స్పీకర్ సమయం ఇస్తారని భావిస్తున్నామని, తాము ఏ ఒక్కరినీ వదలబోమని, ప్రజల ముందు దోషులుగా నిలబెడతామని పేర్కొన్నారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో ఉన్నది రాహుల్ కాంగ్రెస్సా? రేవంత్ కాంగ్రెస్సా చెప్పాలని ప్రశ్నించారు. ఫిరాయింపుల విషయంలో కాంగ్రెస్ 'పాంచ్‌న్యాయ్'కు విరుద్ధంగా ప్రవర్తిస్తున్నదని ధ్వజమెత్తారు. కేంద్రంలో బీజేపీపై రాహుల్ పోరాడుతుంటే ఇక్కడ కాంగ్రెస్ మాత్రం బీజేపీకి తోక పార్టీలా మారిందని ఆరోపించారు.

స్పీకర్ న్యాయం చేస్తారని భావిస్తున్నా

పార్టీ మారిన ఎమ్మెల్యేలపై పిటిషన్ ఇచ్చేందుకు స్పీకర్ బుధవారం సమయం ఇస్తామని చెప్పారని జగదీశ్‌రెడ్డి తెలిపారు. స్పీకర్ న్యాయంగా వ్యవహరిస్తారని భావిస్తున్నట్టు చెప్పారు. రేవంత్‌రెడ్డి పదవిని కాపాడుకునేందుకు ఫిరాయింపులు ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. ఫిరాయింపులపై హైకోర్టు తీర్పు తర్వాతే సుప్రీం కోర్టును ఆశ్రయిస్తామని పేర్కొన్నారు. విద్యుత్తుపై విచారణ కమిషన్‌ను వద్దనడం లేదని, జస్టిస్ నర్సింహారెడ్డిని తప్పించాలని మాత్రమే కోరుతున్నామని తెలిపారు. విచారణలో అన్ని తేటతెల్లం అవుతాయని, కేసీఆర్ మల్లెపూవులా బయటకు వస్తారని చెప్పారు. సమావేశంలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ తాతామధు, మాజీ ఎంపీ లింగయ్యయాదవ్, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేల అనర్హతపై నేడు స్పీకర్‌కు ఫిర్యాదు

హైదరాబాద్, జూన్ 25 (నమస్తే తెలంగాణ): తమ పార్టీలో గెలిచి కాంగ్రెస్‌లో చేరిన శాసన సభ్యులపై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ పార్టీ బుధవారం స్పీకర్‌కు ఫిర్యాదు చేయనుంది. ఫిర్యాదుకు సమయం ఇవ్వాలంటూ మాజీమంత్రి, ఎమ్మెల్యే జీ జగదీశ్‌రెడ్డి మంగళవారం స్పీకర్ అపాయింట్‌మెంట్ కోరారు. మంగళవారం వీలుకాకుంటే బుధవారం తప్పనిసరిగా సమయం ఇస్తానని స్పీకర్ చెప్పినట్టు తెలిపారు. బీఆర్ఎస్ బీఫాంపై గెలిచి కాంగ్రెస్‌లో చేరిన బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌పై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ స్పీకర్‌ను కోరనుంది. పార్టీ మారిన దానం నాగేందర్, కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావుపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ ఇప్పటికే ఫిర్యాదు చేసింది. అంతేకాదు, దానంపై అనర్హత వేటు వేయాలని కోరుతూ హైకోర్టును ఆశ్రయించింది. ఈనెల 27న కేసు విచారణకు రానుంది. హైకోర్టు తీర్పు ఆధారంగా అవసరమైతే సుప్రీంకోర్టుకు వెళ్లాలని బీఆర్ఎస్ నిర్ణయించింది.

అలకవీడని జీవన్‌రెడ్డి

- **జీవన్‌రెడ్డి ఇంటికి భట్టి, శ్రీధర్‌బాబు**
- **గంటన్నరపాటు బుజ్జగింపులు**
- **దీపాదాస్‌తో మాట్లాడించిన నేతలు**
- **సీనియార్టీకి గౌరవమిస్తామని హామీ**
- **అయినా రాజీనామాకే ఎమ్మెల్సీ మొగ్గు**
- **జీవన్‌రెడ్డితో మాట్లాడని రేవంత్**
- **ఎమ్మెల్సీ ఇంటికి కార్యకర్తలు అనుకూలంగా పెద్ద ఎత్తున నినాదాలు**

ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డితో మంగళవారం చర్చలు జరుపుతున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తదితరులు

హైదరాబాద్, జూన్ 25(నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ ఎమ్మెల్యే సంజయ్ చేరికతో కాంగ్రెస్‌లో మొదలైన చిచ్చు మరింత ముదిరింది. ఆయన చేరికను తీవ్రంగా వ్యతిరేకిస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పట్టువీడడం లేదు. ఆయనను బుజ్జగించేందుకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్‌బాబు మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు జీవన్‌రెడ్డి నివాసానికి వెళ్లి చర్చలు జరిపారు. దాదాపు గంటన్నరపాటు జరిగిన ఈ చర్చల్లో జీవన్‌రెడ్డిని బుజ్జగించేందుకు నానా ప్రయత్నాలు చేసినా ఫలితం లేకుండా పోయింది. తన నియోజకవర్గంలో తనకు తెలియకుండా తన ప్రత్యర్థిని ఎలా చేర్చుకుంటారని, విలువ లేనిచోట ఉండడం ఎందుకని ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి వారిని ప్రశ్నించినట్టు తెలిసింది. స్పందించిన మంత్రులు గౌరవానికి భంగం కలగకుండా చూసుకుంటామని, సముచిత స్థానం కల్పిస్తామని ఆయనకు హామీ ఇచ్చినట్టు సమాచారం. అంతేకాదు, మంత్రి పదవి కూడా ఆఫర్ చేసినట్టు తెలిసింది. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో మాట్లాడించేందుకు మంత్రులు ప్రయత్నించినప్పటికీ, ఆయన అందుబాటులోకి రాకపోవడంతో కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీతో ఫోన్‌లో మాట్లాడించినట్టు తెలిసింది. జీవన్‌రెడ్డిని ఆమె బుజ్జగించే ప్రయత్నం చేసినట్టు సమాచారం. తొందరపడి ఎలాంటి నిర్ణయం తీసుకోవద్దని, పార్టీలో సముచిత గౌరవం ఇస్తామని చెప్పినట్టుగా తెలిసింది. అయినప్పటికీ జీవన్‌రెడ్డి పట్టు వీడకపోవడంతో ఇప్పుడే ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయవద్దని, సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ నుంచి వచ్చిన తర్వాత నిర్ణయం తీసుకోవాలని సూచించినట్టు తెలిసింది. జగిత్యాల బీఆర్ఎస్ ఎమ్మెల్యే సంజయ్‌ను పార్టీలో చేర్చుకోవడంపై రెండ్రోజులుగా ఆగ్రహంగా ఉన్న జీవన్‌రెడ్డితో రేవంత్‌రెడ్డి ఇప్పటి వరకు మాట్లాడకపోవడం చర్చనీయాంశంగా మారింది. రేవంత్ మీతో మాట్లాడారా? అన్న విలేకరుల ప్రశ్నకు దీపాదాస్ మున్షీ ఒక్కరే మాట్లాడారని, మరెవరూ తనతో మాట్లాడలేదని జీవన్‌రెడ్డి చెప్పారు.

ముభావంగా మంత్రులు

గంటన్నరపాటు బుజ్జగించినప్పటికీ జీవన్‌రెడ్డి పట్టువీడకపోవడంతో మంత్రులు భట్టివిక్రమార్క, శ్రీధర్‌బాబు ముభావంగా వెనుదిరిగారు. చర్చల అనంతరం భట్టి విలేకరులతో మాట్లాడుతూ అలకవీడడంపై జీవన్‌రెడ్డి ఎలాంటి ప్రకటనా చేయలేదని తెలిపారు. శ్రీధర్‌బాబు మాత్రం మీడియాతో మాట్లాడలేదు.

రాజీనామాకే మొగ్గు

తనకు అన్యాయం జరిగిందన్న మనస్తాపంతో ఉన్న జీవన్‌రెడ్డి ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసేందుకే మొగ్గుచూపుతున్నారు. అందులో భాగంగా శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డిని కలిసేందుకు ప్రయత్నించారు. చైర్మన్‌ను కలిసేందుకు సమయం అడిగానని, తాను అందుబాటులో లేనట్టు ఆయన చెప్పారని జీవన్‌రెడ్డి వెల్లడించారు. మండలి కార్యదర్శిని కలిసి రాజీనామా పత్రం ఇద్దామనుకున్నా ఆయన కూడా అందుబాటులో లేరని తెలిపారు. రాజీనామాకు తాను సిద్ధంగా ఉన్నానని పేర్కొన్నారు.

కాంగ్రెస్‌పై కార్యకర్తలపై ఆగ్రహం

బేగంపేటలోని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఇంటివద్ద మంగళవారం హైడ్రామా నెలకొన్నది. ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేస్తున్నారనే సమాచారంతో ఉదయం నుంచే భారీగా కార్యకర్తలు ఆయన నివాసానికి చేరుకున్నారు. ఆయన్ను బుజ్జగించేందుకు డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రి శ్రీధర్‌బాబు వచ్చినప్పుడు జీవన్‌రెడ్డికి అనుకూలంగా, పార్టీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. జీవన్‌రెడ్డికి జరుగుతున్న అవమానంపై పార్టీ కార్యకర్తలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీని నిలబెట్టిన, సీనియర్ నాయకుడైన జీవన్‌రెడ్డినే పట్టించుకోకపోవడం ఏంటని అగ్రహం వ్యక్తంచేశారు. జీవన్‌రెడ్డి లాంటి నాయకుడు లేకుంటే ఇప్పుడు పార్టీకి అధికారం ఎక్కడిదని ప్రశ్నించారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు అండగా ఉండి, జెండాను భుజాలపై మోసిన సీనియర్ నేతలను అధికారంలోకి వచ్చాక ఇలా అవమానించడం దుర్మార్గమని మండిపడ్డారు.

'పాంచ్ న్యాయ్'కి తిలోదకాలు!

- **మ్యానిఫెస్టోలోని హామీలకూ కాంగ్రెస్ మంగళం**

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, జూన్ 25 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌ను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకోవడంపై ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అసహనంతో ఉన్నారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో పొందుపరిచిన 'పాంచ్ న్యాయ్' నియమాలకు విరుద్ధంగా కాంగ్రెస్ ప్రవర్తిస్తున్నదని మండిపడ్డారు. కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టో 'పాంచ్ న్యాయ్'పై ఇప్పుడు సర్వత్రా చర్చ జరుగుతున్నది.

ఏమిటీ 'పాంచ్ న్యాయ్'?

లోక్‌సభ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ 'పాంచ్ న్యాయ్' పేరిట మ్యానిఫెస్టోను విడుదల చేసింది.'పాంచ్ న్యాయ్' కింద సామాజిక ఆర్థిక కులగణన హామీతోపాటు యువత, మహిళలు, రైతులు, కార్మికులు తదితర వర్గాలకు వరాలు కురిపించింది. ఈ 'పాంచ్ న్యాయ్'లోనే రాజ్యాంగ సమర్థన అనే ప్రత్యేక అంశాన్ని జోడించిన కాంగ్రెస్.. అందులో 13వ అంశంగా ఫిరాయింపుదారులపై వేటుకు సంబంధించి ప్రత్యేక హామీనిచ్చింది. దాని ప్రకారం.. 'ఒక పార్టీ టికెట్‌పై గెలిచిన సభ్యుడు (ఎమ్మెల్యే లేదా ఎంపీ), మరో పార్టీలోకి చేరితే, ఆ సభ్యుడి చట్టసభ సభ్యత్వాన్ని ఆటోమేటిక్‌గా రద్దు చేసే విధంగా చట్టాన్ని తీసుకొస్తాం. రాజ్యాంగంలోని పదో షెడ్యూల్‌లో అవసరమైన సవరణలు తీసుకొస్తాం' అని కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో హామీనిచ్చింది. క్షేత్రస్థాయిలో ఆ హామీని అటకెక్కించి.. ఫిరాయింపుదారులను ప్రోత్సహిస్తుండటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

జీవన్‌రెడ్డి పోతేపోనీ..

- **మనకు పెద్దగా అయ్యేదేమీ లేదు**
- **గవర్నమెంట్ ఏమైనా కూలిపోతదా!**
- **మంత్రులతో ముఖ్యనేత వ్యాఖ్య**
- **సీనియర్ మంత్రుల అసహనం**

హైదరాబాద్, జూన్ 25 (నమస్తే తెలంగాణ): 'జీవన్‌రెడ్డి పోతే పోనీ, ఏమైతది? ఆయన పోతే గవర్నమెంట్ కూలిపోతదా? ఇట్ల మనం వినుకుంటూ పోతే ఇట్లాంటోళ్లు మరికొందరు మోపైతరు' ఇదీ రాష్ట్ర కాంగ్రెస్‌లోని ఓ కీలక నేత వ్యాఖ్య. ఈ మాటలు కాంగ్రెస్‌లో ప్రకంపనాలు సృష్టిస్తున్నాయి. పార్టీలోకి కొత్తగా వచ్చి చేరిన ఒక నేత అధిష్ఠానం తనకు ఇలాగే ఇష్యూస్‌ను హ్యాండిల్ చేయమని చెప్పిందనడం గమనార్హం. జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్‌ను కాంగ్రెస్‌లోకి చేర్చుకోవడాన్ని వ్యతిరేకించిన ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి వ్యవహారం కాంగ్రెస్ పార్టీలో తుఫాను సృష్టిస్తున్నది. రాష్ట్ర కాంగ్రెస్ నేతలు కొందరు వ్యవహరిస్తున్న తీరు పాత కాంగ్రెస్ నేతలకు ఆగ్రహం తెప్పిస్తున్నది. జీవన్‌రెడ్డి ఎమ్మెల్సీగా రాజీనామా చేస్తానని ప్రకటించిన నేపథ్యంలో రాష్ట్ర ముఖ్య నేతలు కీలక నేతను సంప్రదించి విషయం చెప్పారు. ఢిల్లీలో ఉన్న ఆయన జీవన్‌రెడ్డితో ఫోన్ చేసి మాట్లాడేందుకు కూడా ఇష్టపడలేదని కాంగ్రెస్ వర్గాలు చెప్తున్నాయి. అంతే కాదు, 'ఒకరు పోతే పది మంది వస్తారు. ఇట్లాంటి వాళ్లను వదిలించుకుందాం' అని అన్నట్టు కాంగ్రెస్ వర్గాల్లో ప్రచారం జరుగుతున్నది. పాత వారిని పొగబెట్టి పంపిస్తున్నారన్న మెసేజ్ ప్రజల్లోకి వెళ్తుందని, ఇది ఇబ్బందేమో అని ఓ కీలక మంత్రి అన్నట్టు తెల్సింది. 'ఇప్పుడు పొమ్మన్నాపోడు. ఉత్తగనే బెదిరిస్తున్నట్టున్నాడు' అని కూడా ఆ కీలక నేత వ్యాఖ్యానించినట్టు ప్రచారం జరుగుతున్నది.

సీనియర్ మంత్రుల అసహనం

జీవన్‌రెడ్డి వెళ్తే పార్టీకి నష్టమని భావించిన ఒకరిద్దరు నేతలు విషయాన్ని పార్టీ హైకమాండ్‌కు చెప్పడంతోపాటు జీవన్‌రెడ్డిని బుజ్జగించే పనికి ఉపక్రమించారు. ఈ క్రమంలోనే పార్టీలోని ఒక వర్గం పనిగట్టుకొని పాత కాంగ్రెస్ నేతలను అస్థిరతకు గురిచేస్తున్న విషయంపై చర్చకు వచ్చినట్టు తెల్సింది. జీవన్‌రెడ్డి కూడా ఇదే విషయాన్ని కొందరు మంత్రులు, నేతలకు విస్పష్టంగా చెప్పినట్టు తెలిసింది. తెలుగుదేశం, బీఆర్ఎస్ నుంచి నేతలను చేర్చుకొని అసలు కాంగ్రెస్‌ను రూపుమాపే కుట్ర జరుగుతున్నట్టు జీవన్‌రెడ్డి వద్దకు వచ్చిన కొందరు కాంగ్రెస్ నేతలు కూడా వ్యాఖ్యానించినట్టు సమాచారం. రాష్ట్ర స్థాయిలోని కీలక నేత జీవన్‌రెడ్డి వెళ్లిపోతే పోనీయమంటూ చేసిన వ్యాఖ్యలపై కొందరు సీనియర్ మంత్రులు అసహనం వ్యక్తం చేసినట్టు తెలిసింది. ఇది పద్ధతి కాదని, ఇప్పుడు జీవన్‌రెడ్డి వ్యవహారంలో అయినదే మనకు కూడా అవుతుంది కదా అని, పార్టీలో చేర్చుకునే ముందు సంప్రదింపులుండాలని, ఉమ్మడి కరీంనగర్ జిల్లాతో సంబంధంలేని వ్యక్తి చేరికల బాధ్యత తీసుకోవడం సరికాదని పలువురు మంత్రులు అన్నట్టు తెలిసింది. మంత్రులు కొందరు జీవన్‌రెడ్డి వ్యవహారాన్ని చల్లబరిచేందుకు అనుసరించాల్సిన వ్యూహం పై భేటీ అయినట్టు సమాచారం. ఈ సందర్భంగానే వారు పార్టీ పరిస్థితిపై ఆవేదన వ్యక్తం చేసినట్టు తెలిసింది.

రాజీలేదు.. రాజీనామే!

- **పార్టీని వీడతానంటూ సంకేతాలు**
- **తాడోపేడో తేల్చుకునేందుకు సిద్ధం**
- **సన్నిహితులతో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి**

రాజీ కోసం వచ్చిన ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నమస్కరించి చెబుతున్నా ససేమిరా అంటున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి. చిత్రంలో ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

హైదరాబాద్, జూన్ 25(నమస్తే తెలంగాణ): పార్టీలో తనకు జరిగిన అవమానంపై కాంగ్రెస్ సీనియర్ నేత, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి రగిలిపోతున్నారు. ఎంత బుజ్జగించినా తగ్గేదేలే అంటున్నారు.ఎమ్మెల్సీ పదవికి రాజీనామాకు సై అంటున్నారు. పార్టీని వీడేందుకూ వెనకాడబోనని అంటున్నట్టు తెలిసింది. ఇది పదవుల పంచాయితీ కాదని, వ్యక్తిత్వానికి సంబంధించిన అంశమని పేర్కొన్నారు.తాను చేయని పదవి లేదని, అధికారం కొత్తకాదని తెలిపారు. 40 ఏండ్ల రాజకీయ జీవితంలో ఏనాడూ జరగని అవమానం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత పరిణామాలపై సన్నిహితుల వద్ద ఆయన తన అంతరంగాన్ని ఆవిష్కరించారు. తాను ఏం చేయబోతున్నానో వారికి స్పష్టం చేశారు. 'జీవన్‌రెడ్డి అనేవాడు జీవితంలో ఏనాడూ రాజీపడలేదు. ఇప్పుడు కూడా రాజీపడబోడు. రాసిపెట్టుకోండి' అంటూ కార్యకర్తలు, సన్నిహితులకు తేల్చి చెప్పారు. ఇప్పటికీ తాను రాజీనామాకే కట్టుబడి ఉన్నానని స్పష్టం చేసినట్టు తెలిసింది.మంగళవారం తనను బుజ్జగించేందుకు వచ్చిన మంత్రులు భట్టివిక్రమార్క, శ్రీధర్‌బాబు వెళ్లిన తర్వాత కూడా రాజీనామాకు కట్టుబడి ఉన్నట్టు స్పష్టం చేశారు.

సొంత పార్టీలో ఘోర అవమానం

1983లో రాజకీయ జీవితాన్ని ప్రారంభించిన జీవన్‌రెడ్డి 40 ఏండ్ల రాజకీయ ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్నారు. ఆరుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎమ్మెల్సీగా గెలిచారు. ఎన్టీఆర్, నాదెండ్ల భాస్కర్‌రావు, రాజశేఖర్‌రెడ్డి మంత్రి వర్గంలో మంత్రిగా పనిచేశారు. అధిష్ఠానానికి అనుంగు కార్యకర్తగా పేరుపొందిన జీవన్‌రెడ్డి తొలిసారి పార్టీకి వ్యతిరేకంగా గళం విప్పడం గమనార్హం. ఆయనకు సొంత పార్టీలోనే ఘోర అవమానం జరిగింది. తనను రెండుసార్లు ఓడించిన జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌ను కనీసం సమాచారం ఇవ్వకుండా పార్టీలో చేర్చుకోవడంపై ఆయన రగిలిపోతున్నారు. సొంత నియోజకవర్గంలో తనను సంప్రదించకుండా ఇతర పార్టీ ఎమ్మెల్యేను చేర్చుకోవడంపై ఇదేం సంస్కారమని పార్టీ నేతలను నిలదీస్తున్నారు. ఇదేనా రాజకీయం అని ప్రశ్నిస్తున్నారు. 40 ఏండ్లుగా పార్టీకి చేసిన సేవకు ఇదేనా తనకు ఇచ్చే గౌరవం అని ప్రశ్నిస్తున్నారు. ప్రత్యర్థుల ముందు తనను తలదించుకునేలా చేశారంటూ ఆగ్రహంతో ఉన్నారు. ఈ అవమానాన్ని తట్టుకోలేకపోతున్నానని, పదవుల కన్నా తనకు తన జీవితం, ఆత్మగౌరవం ముఖ్యమని తేల్చి చెబుతున్నారు. అందుకే ఇక తగ్గేదేలేదని తేల్చి చెప్తున్నారు. పార్టీకి తనతో అవసరం లేదని భావించినప్పుడు, తనకు మాత్రం ఏం అవసరమని సన్నిహితుల వద్ద అన్నట్టుగా తెలిసింది. అందుకే ఈ విషయంలో రాజీపడబోనని, అవసరమైతే అధిష్ఠానంతో తాడోపేడో తేల్చుకుంటానని స్పష్టం చేసినట్టు తెలిసింది. ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేస్తానని, అవసరమైతే పార్టీకి కూడా రాజీనామా చేసేందుకు వెనకాడబోనని ఆయన చెప్పినట్టు సమాచారం.

ఆయనలాంటి వాళ్ల వల్లే పార్టీకి అధికారం

- **జీవన్‌రెడ్డి మనస్తాపం చెందారు అందుకే మేం తరలివచ్చాం**
- **సీనియర్ నేతలను వదులుకోబోం**
- **జీవన్‌రెడ్డి సీనియార్టీకి గౌరవమిస్తాం**
- **డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**

హైదరాబాద్, జూన్ 25(నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి లాంటి సీనియర్ నాయకులే కారణమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ఆయన మనస్తాపం చెందారని, అందుకే తామంతా తరలివచ్చినట్టు చెప్పారు. అలాంటి వాళ్లకు ఇబ్బంది కలిగితే తామంతా బాధపడతామని పేర్కొన్నారు. మంగళవారం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డితో భేటీ అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. జీవన్‌రెడ్డి ఇబ్బందులను పార్టీ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ఆయన తమకు సీనియర్ నాయకుడని, ఎలాంటి భంగం కలగకుండా చూసుకుంటామని చెప్పారు. వారి స్థాయికి తగ్గట్టుగా గౌరవం ఇస్తామని, సముచిత స్థానం కల్పిస్తామని చెప్పినట్టు తెలిపారు. పార్టీని, ప్రభుత్వాన్ని నడిపించేందుకు ఆయన సీనియార్టీ, ఆలోచనలు అవసరమని పేర్కొన్నారు. ఏ సీనియర్ నాయకుడిని కోల్పోయేందుకు పార్టీ సిద్ధంగా లేదని స్పష్టం చేశారు.

భట్టి ఏమన్నారంటే?

కాంగ్రెస్ పార్టీ పదేండ్లు కష్టకాలంలో ఉన్నప్పుడు అటు శాసనసభలో, ఇటు శాసనమండలిలో పార్టీ భావజాలాన్ని భుజాన వేసుకొని కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేసిన జీవన్‌రెడ్డి లాంటి నాయకుడిని పార్టీ సంపూర్ణంగా గౌరవిస్తది. ఆయన ఆలోచనలను పరిగణలోకి తీసుకుంటది. పార్టీని, ప్రభుత్వాన్ని నడిపించేందుకు వారికి ఉన్నటువంటి సీనియార్టీని, ఆలోచనలను తప్పనిసరిగా పరిగణలోకి తీసుకుంటాం. ఎక్కడ కూడా ఏ సీనియర్ నాయకుడినీ కోల్పోయేందుకు పార్టీ సిద్ధంగా లేదు. కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు ఈ స్థాయిలో ఉందంటే జీవన్‌రెడ్డి లాంటి నాయకులే కారణం. వారు కష్టపడి పోగేస్తేనే రాష్ట్రంలో పాలన చేస్తున్నాం. కాబట్టి ఏ నాయకుడు మనస్తాపానికి గురైనా మేమంతా బాధపడతాం. వారి స్థాయి, సీనియార్టీకి తగ్గట్టుగా, వారి గౌరవానికి భంగం కలగకుండా గౌరవించుకుంటాం.

ఫిరాయింపులు పార్టీ విధానం కాదు

- **ఆ విషయాన్ని మ్యానిఫెస్టోలో చెప్పాం**
- **అందుకే వాటిని వ్యతిరేకిస్తున్నా**
- **సీనియర్లకు పార్టీలో గౌరవం లేదు**
- **పదవులు కాదు.. ఆత్మగౌరవం ముఖ్యం**
- **ఏ పార్టీకి సంఖ్యాబలం ముఖ్యం కాదు**
- **ప్రతిపక్షం బలంగా ఉంటేనే మేలు**
- **మీడియాతో కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి**

హైదరాబాద్, జూన్ 25(నమస్తే తెలంగాణ): ప్రభుత్వానికి తగినంత సంఖ్యాబలం ఉన్నప్పటికీ ప్రతిపక్ష ఎమ్మెల్యేల కోసం ఎందుకు వెంపర్లాడుతున్నదో అర్థం కావడం లేదని కాంగ్రెస్ సీనియర్ నేత, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపులపై తన వ్యక్తిగత ఆలోచన ఏమీ లేదని, కాంగ్రెస్ పార్టీ ఆలోచనే తన ఆలోచనా విధానమని స్పష్టం చేశారు. ఫిరాయింపులకు కాంగ్రెస్ పార్టీ పూర్తి వ్యతిరేకమని, ఇందుకు సంబంధించి జాతీయస్థా